ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన కార్పొరేటర్ బుధవారం కాలనీలో పర్యటించి సమస్యను అడిగి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారులైన ఉషా ముళ్లపూడి రోడ్డు నుంచి జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డు వైపునకు వెళ్లే వాహనాలు శుభోదయ కాలనీ మీదుగా వెళ్లటంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందన్నారు. గోవింద్ హోటల్ చౌరస్తా వద్ద సిగ్నల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నేరుగా పైపులైన్ రోడ్డుకు మళ్లిస్తే సమస్య తగ్గుతుందన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, అల్లురయ్య, సరవయ్య, శర్మ, రత్నం, డా. సునీల్, సుందరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బోనాల చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అమ్మవారి దేవాలయాలకు చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దేవాలయ నిర్వాహకులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహ యాదవ్,ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మందడి శ్రీనివాసరావు, సబిహా బేగం, శిరీషా బాబురావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నామినేషన్ల పర్వం ప్రారంభం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల నామినేషన్‌ల పర్వం బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు బొల్లు శ్రీనివాస్‌రావు తన మద్దతుదారులతో కలిసి స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీగా కమిటి హాల్‌కు వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవివేకానందనగర్ ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తుంగం శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, బండారి ప్రసన్నాంజనేయులు, గుత్తికొండ రామకృష్ణ, లక్ష్మీనాంచారి సుందర కేశవరావు పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న బొల్లు శ్రీనివాస్‌రావు

బాలాజీనగర్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కర్ర గోపీకృష్ణ



నియామకపత్రాన్ని అందజేస్తున్న శ్రీకర్‌రావు

కూకట్‌పల్లి: భారతీయ జనతా పార్టీ బాలాజీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా కర్ర గోపి కృష్ణ నియమితులయ్యారు. బుధవారం డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్ సమక్షంలో కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ శ్రీకర్‌రావు ఆయనను శాలువాతో సత్కరించి నియామకపత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్, సూర్యారావు, శేఖర్, రాము, జగదీష్, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, సన్నీ, మహిళా మోర్చా అధ్యక్షురాలు వీరగంటి జ్యోతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్త కళా ప్రదర్శన



హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

కూకట్‌పల్లి: హెచ్‌ఎంటి హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన స్వదేశీ హస్త శిల్ప కళాఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఎగ్జిబిషన్‌లో బెంగాల్ కాటన్ చీరలు, జార్జెట్, వెంకటగిరి, నారాయణపేట, వర్కు చీరలు, గాగ్రాచోలీ, టాప్స్, ఖాదీ కుర్తీలు, స్కర్టులు, ప్లాజో ప్యాంటు, రాతి ఆభరణాలు, బ్యాంగిల్స్, జైపూర్ బెడ్ షీట్లు, సోఫా కవర్లు, టేబుల్ కవర్లు, కిడ్స్ కిచెన్‌లు, డోర్ మేట్‌లు అందుబాటులో ఉన్నాయి. సెట్, శ్యాంపూర్ ఫర్నిచర్, కొండపల్లి బొమ్మలు అందుబాటులోఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఫర్నిచర్ చెక్కబొమ్మలు, బంజారా బ్యాగులు, బ్లూ పేవింగ్, కుర్జా పేవింగ్, శరన్‌పూర్ చెక్కడం, మార్బుల్, కళాఖండాలు, రాజస్థాన్ ఆభరణాలు, ఉత్తరప్రదేశ్ బెడ్ రగ్గులు, కలంకారీ చీరలపై ప్రత్యేక రాయితీ ఇస్తున్నారు. హస్తకళలపై 10 శాతం, చేనేత వస్త్రాలపై 20 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 21 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, పరిసర ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పగలే వెన్నెల...



అల్లాపూర్ డివిజన్ రైల్వే ట్రాక్ సమీపంలో పట్టపగలు వెలుగుతున్న వీధి లైట్లు

పట్టపగలే వెలుగులు విరజిమ్ముతున్న వీధి లైట్లు....

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రైల్వే ట్రాక్ సమీపంలో పట్టపగలు వీధి లైట్లు వెలుగుతుండటంతో స్థానికులు విస్మయానికి గురవుతున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లకు ఆన్ ఆఫ్ సిస్టం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కార్పొరేషన్ స్థలాన్ని కాజేసేందుకు కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: కార్పొరేషన్‌కు చెందిన రూ.100 కోట్ల విలువైన స్థలాన్ని కాజేందుకు కొందరు వ్యక్తులు పావులు కదుపుతున్నారని నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. బుధవారం ప్రగతినగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020లో అప్పటి కలెక్టర్‌నిజాంపేట్ సర్వే నెంబర్ 233/1,3 మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. రెవెన్యూ, మున్సిపల్ ,పోలీస్ అధికారుల సమక్షంలో సర్వే చేసి 4.19 ఎకరాల స్థలం నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం నిర్మాణం కోసం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఆ తర్వాత సదరు స్థలం తమదేనని తాము ఇక్కడ వ్యవసాయం చేశామని పేర్కొంటూ కోర్టును ఆశ్రయించారన్నారు. అనంతరం బాచుపల్లి సర్వే నెంబర్ 186లో మున్సిపల్ కార్యాలయానికి స్థలం కేటాయిస్తూ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. అయితే ఆ తర్వాత మళ్లీ నిజాంపేట్‌లో సర్వే నెంబర్ 233లోనే ఎమ్మెల్యే వివేకానంద చేతుల మీదుగా కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ఇదిలా ఉండగా కోర్టులో కేసులు వేసిన ప్రైవేటు వ్యక్తులు జీవో 59 కింద 4.19 ఎకరాల స్థలాన్ని రెగ్యూలరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవడమేగా, అందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారన్నారు. ఈ నెల 18న హైకోర్టులో ఈ కేసు విచారణకు వస్తుందని దీనిపై అధికారులు కౌంటర్ వేసి స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కోర్టులో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు కౌంటర్ ఆఫిడవిట్ సమర్పించవద్దని అధికారులను పిలిచి ఓ నాయకుడు మాట్లాడినట్లు ఆరోపించారు. సమావేశంలో అమలేశ్వరీ, అరుణ్ కుమార్, కవితరెడ్డి, మాధవరావు, కుమార్ గౌడ్, ఎల్లస్వామి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సాయినగర్ బస్టాప్ వద్ద ప్రమాదకరంగా ఉన్న నాలా



నాలాపై తొలగిపోయిన కప్పు

ప్రమాదకరంగా నాలాలు



బాచుపల్లి అదిత్య గార్డెన్‌లో ఓపెన్ నాలాపై పై కప్పులు కూలి పోయిన దృశ్యం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలాలు ప్రమాదకరంగా మారాయి. వర్షకాలం ప్రారంభమైన అధికారులు మాత్రం నాలాల మరమ్మతులు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు మాత్రం పూర్తి స్థాయిలో తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. వర్షకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు నాలాల్లో వరద నీరు పెద్ద మొత్తంలో ప్రవహిస్తుంది. ఇలాంటి సందర్భంలో అనుకొని సందర్భంలో నాలాల్లో ఏవరైన పడిపోతే ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంటుంది.

మరి ముఖ్యంగా చిన్నపిల్లలకు అయితే ఈ తీవ్రత ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. గత సంవత్సరం ప్రగతినగర్ ఆర్‌కే లేవుట్‌లో ఓ నాలుగేళ్ల బాబు ఇంటి ముందు ఆడుకుంటూ ఉంటూ నాలాలో ప్రమాద వశాత్తు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతోనైన అధికారుల ఇంకా మేలుకోకపోవడం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షకాలం ప్రారంభమై నెల రోజులు గడిచింది. వర్షాలు సైతం కురుస్తున్నాయి. అయినప్పటికీ పలు ప్రాంతాల్లో మాత్రం ఓపెన్ నాలాలపై మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేకపోవడం విశేషం.

ఈ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న నాలాలు...

ఎన్‌ఆర్‌వి కాలనీ, ఆర్‌కే లేవుట్, ప్రగతినగర్, సాయినగర్, ఆదిత్య గార్డెన్, నిజాంపేట్‌లోని పలు ప్రాంతాల్లో నాలాలు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో తూతూమంత్రంగా నాలాల వద్ద రక్షణ చర్యలుగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన అవి పూర్తి స్థాయిలో లేవు. నాలాలకు రెండు వైపుల వేయకుండా కేవలం రోడ్డు వైపు మాత్రమే వేయడం విశేషం. ఇక మరి కొన్ని ప్రాంతాల్లో అయితే ఏలాంటి రక్షణ చర్యలు లేవు. బహిరంగంగా ఉన్న నాలాలో వరద ప్రవాహం వచ్చే సమయంలో వరద నీరు పూర్తిగా రోడ్డుకు సమాన స్థాయిలో ప్రవహిస్తుండంతో అసలు నాలా ఎక్కడ ఉందనే విషయం సైతం ప్రజలు, పాదచారులు, పిల్లలు గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. ఇక ఈ ప్రాంతానికి కొత్త వారైతే అస్సలు గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. ఇంతంటి ప్రమాదకరమైన పనుల పట్ల అధికారుల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి...

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రమాదకరంగా ఉన్న ఓపెన్ నాలాల వద్ద రక్షణ చర్యలుగా పటిష్టమైన జాలీలు ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా నాలాలపై ఏర్పాటు చేసిన జాలీలకు, నాలాల వద్ద నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలి. నాలాలను అక్రమించి వదర నీరు పోకుండా నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాల్లో వాటిని తొలగించి వరద నీరు సక్రమంగా ప్రవహించేందుకు ఏర్పాట్లు చేయాలి. భారీ వర్షాల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాలి. ఆయా డివిజన్లల్లో పని చేస్తున్న సిబ్బంది, అధికారులను అలెర్ట్‌గా ఉండేందుకు చర్యలు తీసుకోవాలి. ఎక్కడ కూడా నాలాల పై కప్పు లేకుండా ఉండేందుకు ఎప్పుకప్పుడు చర్యలు తీసుకోవాలి. అదే విధంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌పై సైతం మూతలు ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయాలి. ఇలా చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

వెంటనే చర్యలు తీసుకుంటా..



ప్రమాదకరంగా ఉన్న ఓపెన్ నాలాలపై, డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌పై మూతలు, పెన్సింగ్‌లు ఏర్పాటు చేయించే విధంగా వెంటనే చర్యలు తీసుకుంటా. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో అధికారులతో పూర్తి స్థాయిలో సర్వే చేయించి ఎక్కడ అవసరం ఉంటే అక్కడ రక్షణ చర్యలు తీసుకుంటాం. వర్షకాలంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఎక్కడైన నాలాలు ఓపెన్‌గా ఉంటే ప్రజలు వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వేగవంతంగా చర్యలు తీసుకుంటాం.

– కొలను నీలాగోపాల్‌రెడ్డి, మేయర్ నిజాంపేట్

సత్కారం...



మంత్రి పొంగులేటిని సన్మానించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బుధవారం ఆయన నివాసంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా మహాభిషేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: తొలి ఏకాదశి సందర్భంగా మూసాపేటలోని శ్రీవితల రుక్మిణీ మందిరంలో బుధవారం మహా అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బుధవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, సీనియర్ నాయకులు ఉప్పు రాము,ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఎల్లమ్మ కల్యాణానికి ఆహ్వానం



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఏకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు విద్యకల్పనలను సంగీత్‌నగర్ మెట్రో ఆటో డ్రైవర్స్ యూనియన్స్ నాయకులు శ్రీ ఎల్లమ్మ అమ్మవారి కల్యాణానికి హాజరుకావాలని కోరుతూ బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు.

మొహర్రం ప్రార్థనలు..



మాజీ కార్పొరేటర్ బాబూరావు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని టి. అంజయ్య నగర్‌లో మొహర్రం పండుగ సందర్భంగా బుధవారం మూసాపేట మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, బాబురావు పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిహెచ్. ప్రభాకర్‌గౌడ్, సప్పిడి శ్రీనివాస్‌రావు, భాస్కర్ రావు, సుశీల్ కుమార్, తూము నర్సింగ్ రావు, శ్రీశైలం గౌడ్, సుందర్ పాల్గొన్నారు.



మొహర్రం సందర్భంగా పీర్లను దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

బోనాల చెక్కుల పంపిణీ...



బోనాల పండుగ చెక్కులను పంపిణీ చేస్తున్న లక్ష్మణ్ కుమార్, బండి రమేష్

కూకట్‌పల్లి: ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా ఆలయాల్లో సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం కూకట్‌పల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ నిర్వాహకులకు చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని దేవాలయాలకు రూ. 37.40 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమలలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సతీష్ రెడ్డి, నాగిరెడ్డి, పుష్పరెడ్డి, లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షరాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

నిజాంపేట్: బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ప్రగతినగర్ బీజేపీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి అన్నారు. బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ కో కన్వీనర్ రాజు, మీడియాసెల్ కన్వీనర్ సుమన్‌రావులతో కలిసి ప్రగతినగర్ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన నూతన కమిటీ సభ్యులను నియమించారు. ఉపాధ్యక్షులుగా సత్య నారాయణ, పులిగిళ్ల శివ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ సంతోష్ కుమార్ గౌడ్, మైలారం అశోక్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా తడల నవ్యలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి పని చేయాలని, స్థానిక సమస్యలపై ప్రజలకు అందుబాటులో ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: చెట్టుకు ఉరి వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు గట్టున ఉన్న తుమ్మ చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సదరు వ్యక్తి మొహం కుళ్లిపోవడంతో మృతి చెంది నాలుగైదు రోజులు అయి ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు దుస్తులు ధరించి ఉన్నాడని, అతనికి సంబంధించి ఎలాంటి వివరాలు లభించలేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు...



శ్రీ సీతారామచ్రందస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, చైర్మన్ తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



నియామకపత్రాన్ని అందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ జయ దుర్గ మైసమ్మ తల్లి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులకు బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ నియామకపత్రాలను అందజేశారు. చైర్మన్‌గా కూన సత్యం గౌడ్, సభ్యులుగా గుంజరి సత్యనారాయణ ముదిరాజ్, ఎం. కృష్ణారెడ్డి, కె. గోపాల కృష్ణ, మాలెంపాటి సురేష్, ఎస్. శ్రీనివాస రెడ్డి, సదా మహేష్, జి. లహరి, బొడ్డ వెంకట మహాలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావూరి ప్రసాద్, కొడాలి రవి, రాజిరెడ్డి, వెంకటేష్, దగ్గిపాటి, వాసు, రామకోటేశ్వరరావు, శ్రీనివాస్‌రావు, రాజేందర్‌ప్రసాద్, వెంకట్‌రావు, కొఠారి వెంకట్, ఎస్.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 53 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.17.68 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిజాంపేట్: హెచ్‌ఎండీఏ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేఆర్‌సీఆర్ కాలనీ శ్రీహోమ్స్ కాలనీ, 11కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: దేవ భూమి ఉత్తరాఖండ్ సేవా సంస్థాన్ హైదరాబాద్ ఆధ్వర్యంలతో నిర్మిస్తున్న కేదారనాథ్ ఆలయ భూమి పూజకు తనను ఆహ్వానించడం ఆనందంగా ఉందని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు.. ఈ సేవా సంస్థతో తనకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందన్నారు. మేడ్చల్ జిల్లా, ఎల్లంపేట గ్రామంలో చేపట్టిన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవ భూమి ఉత్తరాఖండ్ సేవా సంస్థాన్ ప్రతినిధులు జైపాల్‌సింగ్, నాయాలజీ, సుందర్ అగర్వాల్, బల్వీర్ సింగ్, సోనుబాయి, శ్రీమాన్ రింకు బాయి తదితరులు పాల్గొన్నారు.